

☛ ఇక్కడ కనిపిస్తున్న పోలీస్ సబ్ కంట్రోల్ రూం దుస్థితి చూడండి. గది తలుపులకెదురుగానే కూరగాయల బండి.. చుట్టూ ఖాళీ బాక్స్‌లు.. గుమ్మంలోనే దర్జాగా సేదతీరుతున్న మహిళ. ఇక అందులోకి పోలీసు ఎలా వెళ్లేది?. అయినా వెళ్లేందుకు కూడా వీలులేనంత అపరిశుభ్రత ఆ గదిలో తాండవిస్తోంది.

☛ ఇక్కడ చూడండి.. ఇది కిడ్స్ వరల్డ్ పార్క్ వద్ద ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూం. అందులో సామగ్రి చూసి స్టోర్ రూం అనుకునేరు. అది ట్రాఫిక్ పోలీసుల కోసం ఏర్పాటు చేసిన గది. అయితే నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారడంతో పార్క్ నిర్వాహకులు దొరికిందే సందు అన్నట్లు తమ సామగ్రిని ఇలా నింపేసి ఎంచక్కా తలుపులేసుకున్నారు.



☛ ఈ రెండే కాదు జిల్లా కేంద్రంలో ఎనిమిది ప్రధాన కేంద్రాల్లో పోలీస్ సబ్ కంట్రోల్ రూంలను నిర్మించారు. గాలి, వాన, ఎండలు అధికంగా ఉన్నప్పుడు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఇందులో నుంచే విధులు నిర్వహించేందుకు వీలుగా నాలుగు దిక్కులా జాలీలు, అద్దాలతో వాటిని నిర్మించారు. అయితే నిర్వహణను పోలీసు శాఖ పూర్తిగా విస్మరించడంతో దుమ్మూధూళీ పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. కొన్ని చోట్ల స్థానిక వ్యాపారులు, కూరగాయల గోదాముల్లా వినియోగించుకుంటుండగా.. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకుని ఎలుకలు, బల్లులు, విష కీటకాలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రస్తుతం పోలీసులు వర్షంలోనే నిలబడి విధులు నిర్వహించాల్సి వస్తోంది.

పోలీస్ గూడు..గోడు

- సబ్ కంట్రోల్ రూమ్‌ల నిర్వహణ గాలికి..
- దుమ్ము, ధూళితో నిండి నిరుపయోగంగా మారిన వైనం
- రోడ్డు సైడ్ వ్యాపారులకు అడ్డాగా సబ్ కంట్రోల్ రూంలు

కర్నూలు: కర్నూలు నగరంలో సుమారు 64 ట్రాఫిక్ పాయింట్లు ఉండగా ప్రస్తుతం కేవలం 13 నుంచి 15 పాయింట్లలో మాత్రమే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, మంత్రుల పర్యటన సందర్భంగా వాహన రద్దీ ఏర్పడి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమస్యగా మారుతోంది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు దాదాపు 70 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 46 మంది మాత్రమే ఉన్నారు. అందులో కూడా కంప్యూటర్, కోర్టు మానిటరింగ్ విధులు వంటి వాటికి సిబ్బందిని వినియోగిస్తున్నారు. దీంతో ఉన్నవారితోనే అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నిఘాను పటిష్టం చేయడం సమస్యగా మారింది. ఉన్న సిబ్బందితోనే రోడ్లపై విధులు నిర్వహించేటప్పుడు కనీసం గతంలో సబ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చొని వాహన రాకపోకలను నియంత్రించేవారు. సబ్ కంట్రోల్ రూమ్‌లు శిథిలావస్థకు చేరడంతో రోడ్లపైనే గంటల తరబడి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కిడ్స్ వరల్డ్ వద్ద..

నగరంలోని కిడ్స్ వరల్డ్ కూడలి అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇది ఒకటి. ఇక్కడ పోలీస్ సబ్ కంట్రోల్ గది నిర్మించారు.కానీ సిబ్బంది కొరత వల్ల అక్కడ కొన్ని నెలలుగా పోలీసులు విధులు నిర్వహించడం లేదు. దీంతో అక్కడ నిర్మించిన పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరింది. కిడ్స్ వరల్డ్‌లో జరుగు తున్న అభివృద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్ డ్రమ్ములు, సిమెంట్ బస్తాలు, పాత ఇనుప సామాన్లన్నీ అందులో పేర్చి తలుపులు వేయడంతో పూర్తి దుర్గంధభరితంగా మారింది. పార్కుకు వచ్చే సందర్శకులతో ఈ ప్రాంతం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే దాకా రద్దీగా ఉంటోంది. రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఇక్కడ ట్రాఫిక్ విధులకు సిబ్బందిని నియమించాలని నగర ప్రజలు కోరుతున్నారు. పోలీసు సిబ్బంది కోసం నిర్మించిన సబ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మెటీరియల్‌ను ఖాళీ చేయించి శుభ్రం చేయిస్తే ఉపయోగంలోకి వస్తుంది.

ఐదు రోడ్ల కూడలిలో..

ఐదు రోడ్ల కూడలి అత్యంత రద్దీగా ఉన్న రోడ్లలో ఇది ఒకటి. బస్టాండ్, రైల్వే స్టేషన్, మౌర్యా ఇన్ జంక్షన్, జిల్లాపరిషత్ వైపు వెళ్లే వాహనాలతో తరచూ ఇక్కడ జామ్‌లు ఏర్పడుతుంటాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం విధులు నిర్వహించే సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన పోలీసు సబ్ కంట్రోల్ రూమ్‌ను మొబైల్ క్యాంటీన్ నిర్వాహకులతో పాటు అక్కడే ఉన్న మటన్ కొట్టు నిర్వాహకులు కూడా వారివారి సామగ్రి ఇందులో ఉంచి తలుపులు బిగిస్తుండటం వల్ల సబ్ కంట్రోల్ రూమ్ శిథిలావస్థకు చేరి బూజు పట్టి పోయింది. వాటి నిర్వహణపై పోలీసు ఉన్నతాధికారులు శ్రద్ధ చూపకపోవడం వల్ల ట్రాఫిక్ సిబ్బంది రోడ్డుపైనే నిలబడి విధులు నిర్వహిస్తున్నారు.

చుట్టూ వ్యాపారులే..

జ్యోతి మాల్ పక్కన ఉన్న పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ పూర్తిగా చెత్త, దుమ్ము, ధూళితో నిండిపోయింది. అందులో ఏర్పాటు చేసిన బల్ల సైతం పాడైంది. సమీపంలోని పండ్ల వ్యాపారుల సామగ్రితో పాటు పండ్ల ట్రేలు భద్రపరచుకోవడానికి వినియోగించుకుంటున్నారు. పోలీసుల కోసం ఏర్పాటు చేసిన ఈ గదిని సమీపంలోని వ్యాపారులు తమ దుకాణాల అవసరాల కోసం తెచ్చుకున్న సరుకులను కూడా ఇందులోనే నిల్వ చేసుకుంటున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం వచ్చినా, వేసవికాలంలో ఎండ ఉన్నా రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వీటిని ఆధునీకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.



నగరంలో పెరిగిన వాహనాల రద్దీ

క్లుప్తంగా

సారా తయారీని సహించం

కోడుమూరు రూరల్: సారా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం రవాణాను ఏ మాత్రం సహించేది లేదని కోడుమూరు సెబ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న రెండు నాటుసారా బట్టీలపై కోడుమూరు సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం రవాణా చేసినా, సారా తయారీ చేసినా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. దాడుల్లో కోడుమూరు సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది హనుమంతు, అన్సర్‌బాషా, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

రేపు నగరపాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం పేరుతో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే అర్జీతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రక్షణ గోడ కట్టించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌కు కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు అబుబకర్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు కాలేజీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్షణ గోడ లేకపోవడంతో ఆకతాయిలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దాదాపు 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఇక్కడ విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభం



సీఎండీ బొల్లినేని భాస్కరరావుతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభమయ్యాయని ఆసుపత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. శనివారం ఆయన సేవలను ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. మహిళలు, పిల్లల సంరక్షణ విషయంలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించేందుకు కర్నూలులో మాతాశిశు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగం ఏర్పాటు చేశామన్నారు.ఆసుపత్రిలో 30 మందికి పైగా సీనియర్ వైద్యులు, 200 మందికి పైగా సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ కిశోర్‌రెడ్డి ఎస్వీ, సీఓఓ డాక్టర్ సునీల్, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

థిమాటిక్ ఎగ్జిబిషన్‌కు ఆదరణ



థిమాటిక్ ఎగ్జిబిషన్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న వినియోగదారులు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం వద్ద ఈనెల 12న ఏర్పాటు చేసిన థిమాటిక్ ఎగ్జిబిషన్ ప్రజలను ఆకట్టుకుంటోంది. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మ లు, కలంకారి ఐటమ్స్, జ్యూట్ బ్యాగ్‌లు, హ్యాండ్‌మేడ్ గాజులు, వైట్ మెటల్ బొమ్మలు, రోజ్‌ఉడ్ బొమ్మలు 10 శాతం డిస్కౌంట్‌కు లభిస్తున్నాయని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఎగ్జిమిషన్ ఈనెల 16 వరకు ఉంటుందని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జీఓ 84ను రద్దు చేయాలి



కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుధీర్

కర్నూలు (టౌన్): మున్సిపల్ పాఠశాలలను విలీనం చేసే జీఓ 84ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పీడీల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పదోన్నతుల డే సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ జారీ చేయడం వల్ల మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జీఓను కోర్టులు సైతం వ్యతిరేకించాయన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ పీడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సురేష్, నిర్వహణ కార్యదర్శి జయకర్ పాల్గొన్నారు.

హిందువుల మధ్య చీలికలు తెస్తే సహించం

కర్నూలు కల్చరల్: హిందువుల మధ్య విద్వేషాలు కలిగించి చీలికలు తెచ్చే ప్రయత్నం చేస్తే సహించేది లేదని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం దేవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, కర్నూలు జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్వతీపురానికి చెందిన పైలాదాస్ అలియాస్ జనార్దన్ సామాజిక మాధ్యమాల్లో హిందూ దేవీదేవతలను కించపరుస్తున్నారన్నారు. బ్రాహ్మణ జాతిని అవమానపరుస్తూ ప్రచారం చేసి హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణ సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ సాయినాథ్ శర్మ మాట్లాడుతూ పైలాదాస్ చేస్తున్న అసత్య ప్రచారానికి నిరసనగా కర్నూలు నగరంలో 15వ తేదీ ఉదయం 10 గంటలకు వినాయక్ ఘాట్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నామన్నారు. ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కొలుకుల చంద్రశేఖర్, రామరాజు, శ్యాంసుందర్ శర్మ, నరేష్, పవన్ శర్మ, సునిల్ శర్మ, రాఘవేంద్ర, శివసుబ్రహ్మణ్యం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఐక్యత చాటుతున్న వివిధ సంఘాల నాయకులు

ఇద్దరు వైద్యులకు సేవా రత్న అవార్డు





అవార్డు అందుకుంటున్న డాక్టర్ కృష్ణానాయక్, డాక్టర్ గురురాజ్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాకు చెందిన ఇద్దరు వైద్యులకు హైదరాబాద్‌లో శనివారం సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్, తాజ్ సేవా సంస్థలు సంయుక్తంగా పలు రంగాల్లో సేవలందించిన వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా వైద్యరంగంలో సేవలందించిన కర్నూలు జిల్లా విశ్వభారతి మెడికల్ కాలేజీ జనరల్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ ఎం.కృష్ణానాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గురురాజ్‌లకు ఈ అవార్డు ప్రకటించారు. దీంతో అవార్డును తెలంగాణాలోని ప్రముఖుల చేతుల మీదుగా వారిద్దరూ అందుకున్నారు.

వీరప్రకాష్‌కు అరుదైన గౌరవం

కర్నూలు(అర్బన్): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహించి గత నెలలో పదవీ విరమణ చేసిన బి.వీరప్రకాష్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే, మరో వైపు సంగీతం, కళల పట్ల తనకున్న ఆసక్తితో గాయకుడిగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతూ పలువురు పేద కళాకారులకు బాసటగా నిలుస్తూ వచ్చారు. కరోనా సమయంలో కూడా పలువురికి సహాయ సహకారాలు అందించారు. అలాగే జిల్లాలో ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంక్షేమ సంఘాన్ని స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షులుగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన సేవలకు గుర్తుగా తెలంగాణ రాష్ట్రం పీస్ ఆఫ్ ఇండియా ఎన్‌జీఓ అండ్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ప్రిస్టేజియస్ అవార్డ్స్ అండ్ హానరీ డాక్టరేట్ అవార్డ్ సెర్మనీ కార్యక్రమంలో వీర ప్రకాష్‌కు భారతీయ స్ఫూర్తి సేవా రత్న అవార్డుతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చి ఘనంగా సన్మానించింది. ఆయన చేసిన సేవలకు లభించిన అవార్డుల పట్ల సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న వీరప్రకాష్

టీకాలతో పిల్లల ప్రాణాలకు రక్ష

కర్నూలు(హాస్పిటల్): క్రమం తప్పకుండా గర్భిణులకు, చిన్నారులకు టీకాలు వేయడం వల్ల వారి ప్రాణాలకు రక్ష ఉంటుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం షరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సవారితోట, ఐటీసీ కంపెనీ సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నారులకు ఇచ్చిన టీకాల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు జరగబోయే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకుని డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిని సన్మానించారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా పాపైనా, బాబు అయినా సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డీపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

రెండో పటాలంలో ఏపీఎస్పీ డీఐజీ తనిఖీ

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో ఏపీఎస్పీ మూడవ రేంజ్ డీఐజీ రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ బెటాలియన్లకు చెందిన 160 మంది కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుల్ శిక్షణ, 55 మంది హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఆర్ఎస్ఐలకు శిక్షణ కార్యక్రమం స్థానిక పటాలంలో జరుగుతోంది. శిక్షణ ముగింపులో భాగంగా ప్రమోషన్ టెస్టు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ ప్రభుకుమార్ ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్‌లోని గ్యాస్ గోడౌన్, పటాలం పరిపాలనా విభాగం కార్యాలయం, యూనిట్ మెడికల్ హాస్పిటల్, మినరల్ వాటర్ ప్లాంట్, యూనిట్ క్యాంటీన్, బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీస్, క్వార్టర్ మాస్టర్ గ్రూప్, ఇంగ్లీష్ మీడియా స్కూల్, కళ్యాణ మండపం, సురక్ష వెల్ఫేర్ స్టోర్‌ను తనిఖీ చేశారు. పటాలం సిబ్బందికి తక్కువ ధరలకే సరుకులు అందిస్తున్నందుకు గాను అక్కడి సిబ్బందిని ఆమె అభినందించారు. అనంతరం పటాలం సిబ్బందికి దర్బార్ నిర్వహించారు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారుల సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఐజీకి అందజేశారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారు. అసిస్టెంట్ కమాండెంట్లు రవికిరణ్, ఎస్ఎం బాషా, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



డీఐజీ రాజకుమారికి వినతిపత్రం సమర్పిస్తున్న పోలీసు అధికారుల సంఘం ప్రతినిధి బృందం

పెద్దాసుపత్రిలో పందుల బెడద



మానసిక జబ్బుల విభాగం వద్ద సంచరిస్తున్న పందులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పందుల బెడద ఎక్కువైంది. ఆసుపత్రిలో ఏ ఆవరణలో చూసినా ఇవి దర్శనమిస్తుండటంతో రోగులు, వారి సహాయకులు అసహనానికి గురవుతున్నారు. శుశ్రతభవన్, మానసిక రోగుల విభాగం, స్టేట్ క్యాన్సర్ యూనిట్, నూతన కాలిన రోగుల వార్డు, మాతాశిశు విభాగం, డైట్, క్యాన్సర్ యూనిట్ తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఒక్కోసారి రోగుల సహాయకులపై దాడులకు పాల్పడుతున్నాయి. కాగా వీటికి సౌలభ్యంగా ఉండేందుకు కొందరు వ్యక్తులు ఆసుపత్రి భవనాల డ్రైనేజీ పైపులను పగులగొడుతున్నట్లు సమాచారం.

కౌన్సిల్‌కు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రజా ప్రతినిధులు

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కౌన్సిల్‌కు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఇటీవల ఎన్నికైన ప్రజాప్రతినిధులు నియమితులయ్యారు. రాష్ట్ర మంత్రి, కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ,కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరిలను అధికారికంగా గుర్తించారు. కాగా కోడుమూరు ఎమ్మెల్యే కర్నూలుతో పాటు గూడూరు నగర పంచాయతీలో సభ్యులుగా వ్యవహరించనున్నారు.కౌన్సిల్ సభ్యులుగా వ్యవహరించనున్న నలుగురు ప్రజాప్రతినిధులకు ఓటు హక్కు ఉంటుంది.విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఏదైనా ఓటింగ్ చేపట్టే విషయంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ప్రజాప్రతినిధులకు ఓటు హక్కు ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

- కూతురికి గాయాలు



మృతిచెందిన సోమేశ్వరమ్మ

కర్నూలు: స్థానిక బళ్లారి చౌరస్తా అంబికా మెటల్ స్టోర్స్ వద్ద చిరు వ్యాపారం నిర్వహించుకుంటున్న సోమేశ్వరమ్మ (52) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకుని కూతురు ప్రశాంతితో కలిసి వీకర్ సెక్షన్ కాలనీలోని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దపాడు వైపు నుంచి గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి తల్లీకూతుళ్లను ఢీకొంది. ప్రమాదంలో సోమేశ్వరమ్మ అక్కడికక్కడే మృతిచెందగా ప్రశాంతికి రక్త గాయాలయ్యాయి. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలిసినవారు కానీ, ఆ సమయంలో ఘటనా స్థలం వద్ద ఉండి ఫొటోలు కానీ, వీడియో కానీ తీసివుంటే 90003 34894/98482 20844 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ సీఐ గౌతమి విజ్ఞప్తి చేశారు.

రంగస్థల కళాకారులకు సన్మానం

కర్నూలు కల్చరల్: జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రంగస్థల కళాకారులను ఘనంగా సన్మానించారు. శనివారం మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ జాతీయ పురస్కార గ్రహీతలు హనుమంతరావు, బైలుప్పల షఫీవుల్లా, లిమ్కా బుక్ ఆఫ్ పురస్కార గ్రహీత డాక్టర్ అరుణకుమారిలను సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గుర్రపుశాల అంకయ్య మాట్లాడుతూ కళాకారులు ప్రేక్షకులను మెప్పించేలా అభినయం ఉండాలన్నారు. మంచి కళాకారులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, డాక్టర్ సుభాన్, విశ్రాంత తహసీల్దార్ రోషన్‌అలీ, సీనియర్ కళాకారులు దస్తగిరి, మనోహర్‌బాబు, సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న కళాకారులతో అతిథులు

గుర్రపు డెక్కను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న కేసీ కెనాల్‌లో విస్తరించిన గుర్రపుడెక్కను తొలగించాలని సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం నాయకులు వినాయక ఘాట్ సమీపంలో కేసీ కెనాల్‌లో మొలచిన గుర్రపు డెక్కను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు డెక్క దోమలకు నిలయం కావడంతో అతిసారం, డయేరియా ప్రబలుతున్నాయన్నారు. కెనాల్‌కు సమీపంలోని ప్రజలు మురుగు నీటిని కాలువలోకి వదులుతుండడంతోనే సమస్య తలెత్తుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రామకృష్ణ, అబ్దుల్‌దేశాయ్, ఆర్.కృష్ణ పాల్గొన్నారు.



కెనాల్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నిందితులను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): దళిత మహిళ గుండమ్మను హత్య చేసిన రాఘవేంద్రరెడ్డి, అతని అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన గుండమ్మ.. రాఘవేంద్రారెడ్డి సంబంధీకుల భూములను కౌలు చేసిందన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని రాఘవేంద్రరెడ్డి దౌర్జన్యంగా పొలంలోకి వెళ్లి గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యచేశారన్నారు. నిందితులను అరెస్టు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, దావీదు, సురేంద్ర, లక్ష్మి, సుధాకర్, ప్రేమ్‌రాజ్, ఏసన్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు